# సత్వర న్యాయానికి దారి

అపరిష్కృత వ్యాజ్యాలు భారీగా పేరుకుపోతుండటం, భారత న్యాయవ్యవస్థ నేడు ఎదుర్కొంటున్న అతి గడ్డు సమస్య. పెండింగ్ కేసుల భారాన్ని సర్వోన్నత న్యాయస్థానం సైతం తప్పించుకోలేక పోతున్నదనడానికి, భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ ప్రధాని నరేంద్ర మోదీకి రాసిన తాజా లేఖాంశాలే దాఖలా. సుప్రీంకోర్టులో 58 వేలకు పైబడిన అపరిష్కృత వ్యాజ్యాల రాశి ఇంకా విస్తరిస్తున్న నేపథ్యంలో అదనంగా జడ్జీలను నియమించాలని సూచించిన చీఫ్ జస్టిస్ గొగోయ్- హైకోర్టు న్యాయమూర్తుల పదవీ విరమణ వయసును 62 నుంచి 65 ఏళ్లకు పెంచాలని కోరుతున్నారు. సుప్రీంకోర్టుతోపాటు వివిధ ఉన్నత న్యాయస్థానాల్లో గుట్టలుగా పేరుకుపోయిన కేసులకు మోక్షం కల్పించడానికి 128, 224ఏ రాజ్యాంగ అధికరణల కింద విశ్రాంత న్యాయమూర్తుల సేవలు స్వీకరించాలనీ ఆయన సూచించారు. మూడు దశాబ్దాల క్రితం 18 నుంచి 26కి పెరిగిన సుప్రీం న్యాయమూర్తుల సంఖ్య ఆపై 31కి చేరి పదేళ్లయింది. జడ్జీల పదవీ విరమణ వయసు పెంపు అన్నది ఇతరత్రా అనేకాంశాలతో ముడివడిన నిర్ణయం కనుక కేంద్రం ఇప్పుడు అందుకు సుముఖంగా లేదన్న సంకేతాలు వెలువడుతున్నాయి. ఇక, న్యాయమూర్తుల సంఖ్య పెంపొందించాలన్నది దశాబ్దాలుగా తగిన మన్నన దక్కని ప్రతిపాదన. దేశంలో ప్రతి 10 లక్షల జనాభాకు 50మంది చొప్పున న్యాయాధీశుల్ని నియమించాల్సిందిగా న్యాయసంఘం (లా కమిషన్) 1987లోనే సిఫార్సు చేసింది. ఆ లెక్కన 135 కోట్లకు మించిన దేశ జనసంఖ్యకు దీటుగా సుమారు 67 వేలమంది న్యాయమూర్తులు వివిధ అంచెల్లో కొలువుతీరి ఉండాలి. అత్యున్నత న్యాయస్థానం నుంచి కిందిస్థాయి కోర్టుల దాకా మంజూరైన కొలువులే 24 వేలలోపు; అందులోనూ ఖాళీలు వెక్కిరిస్తున్న తరుణంలో- ఏవో కొన్ని నియామకాలు, తాత్కాలిక సర్దుబాట్లతో పరిస్థితి కుదుటపడుతుందనుకోవడం వట్టి భ్రమ.

దేశవ్యాప్తంగా ఉన్నత న్యాయస్థానాల్లో ఒక కొలిక్కిరాక పోగుపడిన వ్యాజ్యాల సంఖ్య 42 లక్షలకు మించిపోయింది. అత్యధిక పెండింగ్ కేసుల ప్రాతిపదికన బాంబే, పంజాబ్, హరియాణా, కలకత్తా, రాజస్థాన్, మధ్యప్రదేశ్ హైకోర్టులు ముందువరసలో ఉన్నట్లు అధికారిక గణాంకాలు చాటుతున్నాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అయిదు నుంచి పదేళ్లుగా 95 వేలవరకు, పది నుంచి ఇరవై సంవత్సరాలుగా సుమారు 48 వేల వ్యాజ్యాల్లో కక్షిదారులు చకోర పక్షుల్లా నిరీక్షిస్తున్నారు. అన్ని హైకోర్టుల్లోనూ కలిపి నాలుగు వందల దాకా జడ్జీల ఖాళీలు భర్తీ కాకుండా ఉండిపోయాయి! ఎకాయెకి రెండు కోట్ల 70 లక్షల మేర అపరిష్కృత వ్యాజ్యాలు పోగుపడిన జిల్లా, సబార్డినేట్ కోర్టుల్లో నిలిచిపోయిన నియామకాలు అయిదు వేలకు పైమాటే. దేశంలో పెండింగ్ కేసుల కొండలు కరిగించడానికి ఎన్ని అదనపు కోర్టులు అవసరమో శాస్త్రీయంగా మదింపు వేయాలన్న 'సుప్రీం' ఆదేశాల మేరకు న్యాయసంఘం విపుల నివేదికను సమర్పించి అయిదేళ్లయింది. దిగువస్థాయిలో స్వల్పంగా న్యాయాధికారుల పదవుల్ని పెంచిన రాష్ట్ర ప్రభుత్వాలు, ఖాళీలు భర్తీ చేయాల్సిన బాధ్యతను గాలికొదిలేయడంతో- అసంఖ్యాక న్యాయార్థుల సుదీర్ఘ గుండెకోత అంతులేని కథగా కొనసాగుతోంది. సుప్రీంకోర్టు గత నవంబరులో రాష్ట్ర ప్రభుత్వాల్ని బోనులో నిలబెట్టి, హైకోర్టుల పాలన విభాగాల అలసత్వాన్ని సూటిగా- ఎక్కడి గొంగడి అక్కడే. వచ్చే ఆరు నెలల్లో వివిధ హైకోర్టులకు చెందిన 40మందికి పైగా న్యాయమూర్తులు పదవీ విరమణ చేస్తున్న దృష్ట్యా- ఆ మేరకు ఖాళీల సత్వర భర్తీతోపాటు అదనపు నియామకాలూ చురుకందుకోవాల్సి ఉంది. దిద్దుబాటు చర్యలు కరవై యథాతథంగా మందభాగ్యం కొనసాగితే దేశంలో ఇంకో రెండు దశాబ్దాల్లో పెండింగ్ కేసుల సంఖ్య 15 కోట్లకు పెచ్చరిల్లుతుందన్న అంచనా, ప్రజా ప్రభుత్వాలకు పెను ప్రమాద హెచ్చరిక!

భారత న్యాయవ్యవస్థ ఎడ్లబండి కాలంలోనే ఉండిపోయిందని సుప్రీంకోర్టు గౌరవ న్యాయాధీశులే ఈసడించిన సందర్భాలున్నాయి. సశక్త సమర్థ వ్యవస్థగా న్యాయపాలిక భాసిల్లాలన్న ప్రజాభీష్టానికి వ్యవస్థాగత లోటుపాట్లు తూట్లు పొడుస్తున్నాయి. దేశంలో సివిల్ దావాల పరిష్కరణకు సగటున పదిహేను సంవత్సరాలు పడుతుండగా, క్రిమినల్ కేసులకు సంబంధించీ అయిదు నుంచి ఏడేళ్ల వరకు నిరీక్షించాల్సి వస్తోంది. వకీళ్లు కోరిందే తడవుగా వాయిదాలపై వాయిదాలు పడుతున్న కేసుల మూలాన కక్షిదారులు విపరీత ప్రయాసాయాసాలకు గురవుతున్నారు. కాలదోషం పట్టిన చట్టాలు, అసంబద్ధ విధివిధానాలు- న్యాయం కోరి కోర్టు తలుపు తట్టడమే నేరమైందని కక్షిదారులు విలపించే దుస్థితి కల్పిస్తున్నాయి. ఒకప్పుడు ఇటువంటి అవస్థలే చవిచూసిన బ్రిటన్- పౌరన్యాయ వ్యవస్థను సరళీకరించి, విస్తృత సంస్కరణలు చేపట్టడం గొప్ప సత్ఫలితాలు చేకూర్చింది. అటు కేసుల పరిష్కరణ వేగం ఇనుమడించింది, ఇటు న్యాయార్థులపై వ్యయభారం దిగివచ్చింది! కనిష్ఠ వ్యవధిలో వ్యాజ్య పరిష్కరణ నిమిత్తం న్యాయమూర్తులకు, న్యాయవాదులకు శిక్షణ సమకూర్చి, కేసుల నిర్వహణలో నిర్దిష్ట మార్గదర్శకాలు క్రోడీకరించి, పౌరశ్రేయస్సాధకంగా సివిల్ ప్రొసీజర్ చట్టం రూపొందించిన బ్రిటన్- అవసరార్థులకు న్యాయసేవలు అందించడంలోనూ తనదైన ఒరవడి దిద్దింది. మధ్యవర్తిత్వానికి ప్రాధాన్యమిచ్చి వ్యాజ్యాల ఉరవడికి కళ్లెం వేసిన అమెరికా, అట్టడుగు నుంచీ పైదాకా కోర్టుల్ని కంప్యూటరీకరించి అనుసంధానించి నెలల వ్యవధిలో శిక్షలు ఖరారు చేస్తున్న చైనాల అనుభవాలూ మనకు విలువైన గుణపాఠాలు. అడుగడుగునా జవాబుదారీతనానికి ప్రోదిచేసే సమగ్ర న్యాయసంస్కరణలతోనే దేశంలో కక్షిదారులు తెరిపిన పడతారు!

# ప్రమాదంలో ప్రజారోగ్యం



భారతీయ వైద్యరంగం సమస్యలతో సతమతమవుతోంది. వైద్యులు, నర్సుల కొరత, వైద్యశాలల్లో మౌలిక సదుపాయాల లేమి వంటి ఇబ్బందులను ఎదుర్కొంటోంది. ఏటా కొత్త కళాశాలలు ఆవిర్భవిస్తున్నా నేటికీ అవసరం మేరకు వైద్యులు, నర్సులు లేరు. దేశంలో 60 కోట్ల ప్రజలకు వైద్య సౌకర్యాలు కొరవడ్డాయి. ప్రస్తుతం దేశంలో 135 కోట్లకు పైబడిన జనాభాకు అందుబాటులో ఉన్న వైద్యులు కేవలం ఏడున్నర లక్షలమందే అంటే ఆశ్చర్యం కలగక మానదు. ప్రతి 1,425 మందికి అందుబాటులో ఉన్న వైద్యుడు ఒక్కరే. లేదా ప్రతి 1,000 మందికి 0.702 వైద్యుడు ఉన్నారు. భారత్‌కన్నా ఇతర దేశాల్లో పరిస్థితి ఒకింత మెరుగ్గానే ఉంది. ప్రతి వెయ్యి జనాభాకు ఆస్ట్రేలియాలో అత్యధికంగా 3.273, బ్రిటన్‌లో 2.778, అమెరికాలో 2.542, చైనాలో 1.456 వంతున వైద్యులు ఉన్నారు. భారత్‌లో ఉన్న కొద్దిమంది వైద్యుల్లో అత్యధికులు పట్టణాలకే పరిమితమవుతున్నారు. గ్రామాల్లో సేవలు అందించేందుకు ఆసక్తి చూపడం లేదు. ఫలితంగా పల్లెల్లో వైద్యసేవల పరిస్థితి దయనీయంగా ఉంది. వైద్యుల్లో 34 శాతం, నర్సుల్లో 33 శాతమే గ్రామాల్లో సేవలు అందిస్తున్నారు. వైద్యులు, నర్సుల్లో ఎక్కువమంది మహారాష్ట్ర, తమిళనాడు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వంటి కొన్ని రాష్ట్రాల్లోనే కేంద్రీకృతమై ఉన్నారు.

వైద్యులు ప్రధానంగా ప్రైవేటు రంగం పట్ల ఆసక్తి చూపిస్తున్నారు. ఈ మధ్యకాలంలో కొత్త వైద్య కళాశాలల ఆవిర్భావంతో పెద్ద సంఖ్యలో వైద్య పట్టభద్రులు వస్తున్నమాట నిజమే. కానీ, వారిలో అత్యధికులు అధిక సంపాదన కోసం ప్రైవేటు రంగానికి బారులు కడుతున్నారు. ప్రతి అయిదుగురు వైద్యుల్లో నలుగురు, ప్రతి పదిమంది పారా మెడికల్ సిబ్బందిలో ఏడుగురు ప్రైవేటు రంగంలో పనిచేస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆస్పత్రులు వైద్యులు, సిబ్బంది కొరతతో సతమతమవుతున్నాయి. ఈ సమస్యను అధిగమించడానికి కొన్ని రాష్ట్రాలు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నాయి. ప్రభుత్వ ఆరోగ్య సంస్థలు, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, నిపుణుల కొరత తీర్చడానికి కర్ణాటక సర్కారు 2017-18లో 'ఆన్ కాల్ డాక్టర్' పథకాన్ని ప్రారంభించింది. అవసరమైనప్పుడల్లా వీరు ప్రైవేటు ఆస్పత్రుల నుంచి ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చి చికిత్స అందిస్తుంటారు. రోజులో ఎంతమంది రోగులకు చికిత్స చేశారనే ప్రాతిపదికపై వీరికి చెల్లింపులు చేస్తారు. అయినప్పటికీ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రులు వైద్యుల కొరతతో సతమతమవుతున్నాయి. దీంతో బయటి నుంచి వచ్చే వైద్య నిపుణులకు చెల్లించే ఫీజులను పెంచాలని ప్రభుత్వం గత మార్చిలో నిర్ణయించింది. దీంతోనే సమస్య పరిష్కారమై పోతుందని చెప్పడం కష్టమే.

### ఏళ్ల తరబడి నిర్లక్ష్యం

పెద్దయెత్తున వైద్యులను వచ్చినంత మాత్రాన సమస్య పరిష్కారం కాబోదు. ఏటా సుమారు 2.6 కోట్ల చొప్పున పెరుగుతున్న దేశ జనాభాకు దీటుగా అదనపు వైద్య సిబ్బందిని సమకూర్చుకోవడంలోనూ ప్రభుత్వం విఫలమవుతూనే ఉంది. ప్రస్తుతం దేశానికి 20 లక్షల మంది వైద్యులు, 40 లక్షల మంది నర్సులు అవసరం. 2017నాటికి దేశవ్యాప్తంగా ఉన్న 462 వైద్య కళాశాలల్లో ఏడాదికి 56,748 మంది వైద్య విద్యార్థులకు మాత్రమే శిక్షణ ఇస్తున్నారు. 3,123 నర్సింగ్ కళాశాలల్లో 1,25,764 మంది నర్సులకు శిక్షణ లభిస్తోంది. ఆరోగ్య సంరక్షణ పరిశ్రమ సారథ్య సంస్థ అయిన నేట్ హెల్త్ అంచనా ప్రకారం 2025కల్లా దేశానికి కోటిన్నర నుంచి రెండు కోట్ల వరకు వైద్యులు, సహాయక సిబ్బంది అవసరపడతారు. కానీ, 2039 వరకు దేశాన్ని వైద్యుల కొరత పీడిస్తూనే

### వెన్నాడుతున్న వైద్యుల కొరత

ఉంటుందని నేట్ హెల్త్ ఆరోగ్య నివేదిక హెచ్చరించింది.

వర్తమానంతోపాటు భవిష్య అవసరాలనూ తీర్చడానికి ఇప్పటి నుంచే నడుం బిగించాల్సిన అవసరాన్ని కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. అందుకే రాష్ట్రాల్లో ఏఐఐఎమ్ఎస్ (ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్) తరహాలో ఉన్నత వైద్య విజ్ఞాన సంస్థల ఏర్పాటుకు నడుం కట్టింది. గడచిన రెండేళ్లలో కొత్త వైద్య కళాశాలలకు అనుమతి ఇవ్వడంతోపాటు ఇప్పటికే నడుస్తున్న కళాశాలల్లో కేంద్ర నిధులతో అదనంగా సీట్లు పెంచింది. దేశమంతటా అదనంగా 10,000 ఎమ్‌బీబీఎస్ సీట్లు, 8,000 పీజీ సీట్లను సృష్టిస్తామని భారతీయ జనతా పార్టీ తన ఎన్నికల ప్రణాళికలో ప్రకటించింది. ఆ హామీని నెరవేర్చే క్రమంలో భాగంగా కేంద్ర సర్కారు 2019-20 విద్యా సంవత్సరంలో 2,750 సీట్లతో 25 కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలలను స్థాపించనున్నట్లు ప్రకటించింది. వీటికితోడు 2019లో 1,500 సీట్లతో 10 ప్రైవేటు వైద్య కళాశాలలు ప్రారంభం కానున్నాయి. 10,000 అదనపు సీట్ల లక్ష్యాన్ని నెరవేర్చాలంటే ఇంకా 5,750 సీట్లను సృష్టించాలి. పెరిగే విద్యార్థులకు దీటుగా అధ్యాపక సిబ్బందీ పెరగాలి. ఈ ఏడాది కొత్తగా ఏర్పాటు చేయదలచిన 35 ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలలకు 600 మంది ఆచార్యులు, 1,000మంది సహ ఆచార్యులు, 1,500 మంది సహాయ ఆచార్యులు అవసరమవుతారు. మరోవైపు 2016 నుంచి ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ప్రారంభమైన 100 కొత్త వైద్య కళాశాలలకు 9,000 మంది అధ్యాపకులు కావాలి. 2019లో ఏర్పాటయ్యే కొత్త కళాశాలలను కలుపుకొంటే మొత్తం సంస్థలు 529కి చేరతాయి. వాటిలోని ఎమ్‌బీబీఎస్ సీట్లు 70,978. ఆ లెక్కన బోధన సిబ్బంది, వసతులకు గిరాకీ పెరిగిపోతుంది.

దేశ ప్రజల ఆరోగ్య అవసరాల మరింతమంది విద్యార్థులు వైద్యరంగంలోకి అడుగుపెట్టాలి. ఇందుకోసం జిల్లా స్థాయి ఆస్పత్రులను వైద్య కళాశాలలుగా మార్చనున్నట్లు కేంద్ర ఆరోగ్య శాఖ ప్రకటించింది. ఈ పథకం కింద మొదటి దశలో 58 జిల్లా ఆస్పత్రులను, రెండో దశలో 24 ఆస్పత్రులను ఎంపిక చేశారు. వాటిలో 39 ఇప్పటికే వైద్య కళాశాలలుగా మారాయి. మూడో దశలో 75 జిల్లా ఆస్పత్రులను వైద్య కళాశాలలుగా మార్చనున్నారు. వీటిని వైద్య సేవలకు నోచుకోని జిల్లాల్లో ఏర్పాటు చేయడానికి ప్రాధాన్యమిస్తారు. ఒక్కో ఆస్పత్రిని వైద్య కళాశాలగా మార్చడానికి రూ.325 కోట్లు ఖర్చవుతాయి. కొత్తగా అన్ని హంగులతో ఒక ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటుకు అయిదేళ్లు పడుతుంది. రూ.450 కోట్ల పెట్టుబడి అవసరమవుతుంది. తరవాత ఏటా నిర్వహణ కోసం రూ.150 కోట్ల చొప్పున వెచ్చించాలి. దేశంలో పలు రాష్ట్ర ప్రభుత్వాలకు ఇంత ఆర్థిక స్తోమత లేదు.

### సాంకేతికత ఆసరా



పాత, కొత్త వైద్య కళాశాలలు అధ్యాపకుల కొరతతో ఇబ్బందిపడుతున్నాయి. అర్హులైన అధ్యాపకులు దొరక్క, ఇప్పటికే వైద్య విద్యా ప్రమాణాలను సడలించారు. కొత్త సంస్థల్లో ఆదరాబాదరాగా కోర్సు పూర్తి చేయించి, సరైన శిక్షణ లేని వైద్యులను తయారు చేస్తున్నారన్న ఆందోళన వ్యక్తమవుతోంది. కాబట్టి సుశిక్షిత వైద్యుల తయారీకి పకడ్బందీ విధానాలు చేపట్టాలి. వైద్య విద్యలో ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం ఒక ఆచరణీయ పరిష్కారం. టెలిమెడిసిన్, రిమోట్ మానిటరింగ్ సాధనాలను విస్తృతంగా చేపట్టడం ద్వారా ప్రస్తుతం అందుబాటులో ఉన్న వైద్యులతోనే ఎంతోమంది రోగులకు చికిత్స అందించవచ్చు. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రముఖ ఆస్పత్రులు ఇప్పటికే ఈ విషయంలో చొరవ తీసుకున్నాయి. మదురైకి చెందిన అరవింద్ ఐ హాస్పిటల్ తమిళనాడు రాష్ట్రమంతటా 66 టెలిమెడిసిన్ కేంద్రాలను నెలకొల్పి, రోజుకు 1,800 మందికి నేత్ర పరీక్షలు చేస్తోంది. ఈ కేంద్రాలు నేత్ర పరీక్షల వివరాలను ఎలక్ట్రానిక్ రికార్డుల్లో నమోదు చేస్తాయి. వాటిని చూసి ప్రధాన ఆస్పత్రిలోని వైద్యులు కళ్లద్దాలను సూచిస్తారు. ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, అపోలో ఆస్పత్రితో కలిసి పట్టణ, గ్రామీణ రోగులకు టెలిమెడిసిన్ సేవలు అందిస్తోంది. నేత్ర పరీక్షలూ వీటిలో భాగమే. పట్టణాల్లో ఉన్న వైద్యులు గ్రామాల్లోని రోగులకు చికిత్స సదుపాయం అందించడానికి టెలిమెడిసిన్ ఉపయోగపడుతోంది. 2021కల్లా 1.30 కోట్లమందికి ఈ పద్ధతిలో సేవలు అందించాలని అపోలో ఆస్పత్రుల గ్రూపు యోచిస్తోంది. సాధారణ జ్వరాలు, గర్భిణులు, బాలింతలకు చికిత్స, మధుమేహం, ఎముకలు, హృదయ సంబంధ వ్యాధులకూ టెలిమెడిసిన్ విధానం అనువైనది. గ్రామాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు టెలిమెడిసిన్ సౌకర్యం కల్పిస్తే వైద్యుల కొరతను చాలావరకు అధిగమించవచ్చు. భారత అంతరిక్ష పరిశోధన సంస్థతో కలిసి కేంద్రం టెలిమెడిసిన్ సేవలు అందిస్తోంది. ఈ యంత్రాంగంలో మొత్తం 384 ఆస్పత్రులు అనుసంధానమయ్యాయి. వీటిలో 18 సంచార యూనిట్లు (మొబైల్ వ్యాన్లు) ఉన్నాయి.

### ఆయుష్మాన్ భారత్‌కు అండగా...

ఆయుష్మాన్ భారత్ పథకం కింద 50 కోట్లమందికి ఆరోగ్య బీమా కల్పించాలని కేంద్ర ప్రభుత్వం తలపెట్టడం ప్రశంసనీయమే. ఈ పథకం విజయవంతం కావడానికి వైద్య సిబ్బంది అందుబాటుతోపాటు, మౌలిక వసతుల లభ్యతా ఎంతో కీలకమవుతాయి. దాదాపు 136 కోట్లుగా ఉన్న జనాభాకు 23,582 ఆస్పత్రులు మాత్రమే ఉన్నాయని అంచనా. వాటిలో సగానికిపైగా ప్రైవేటు ఆస్పత్రులే కావడం గమనార్హం. ఈ ఏడాది ఫిబ్రవరి వరకు 15,000 ఆస్పత్రులు ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగస్వాములుగా చేరగా, వాటిలో 15 శాతం ప్రైవేటు ఆస్పత్రులే. వైద్యులు, ఆస్పత్రులు, పడకల కొరతను అధిగమించి శీఘ్రంగా, సమర్థంగా వైద్య సేవలు అందించడానికి టెలిమెడిసిన్ వంటి ఆధునిక సాంకేతికతలను చేపట్టాలి. మొబైల్ ఫోన్లు, వ్యక్తిగత వైద్య పరికరాలు, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) సాధనాల్లో ఆరోగ్య రికార్డులను పొందుపరచడానికి తగు ప్రమాణాలు, యంత్రాంగాలను ఏర్పరచాలి. వైద్య సమాచారాన్ని ఎలక్ట్రానిక్ వైద్య రికార్డు (ఈఎమ్ఆర్)లలో పొందుపరచి, ప్రాంతీయ, కేంద్ర స్థాయి ఆరోగ్య సమాచార మార్పిడి కేంద్రాల్లో భద్రపరచాలి. ఈ సమాచారాన్ని ఆస్పత్రులు, వైద్యులకు అందుబాటులో ఉంచాలి. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం త్వరలో లోక్‌సభలో ప్రవేశపెట్టనున్న జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎమ్‌సీ) బిల్లు ఆయా వర్గాల్లో ఆశలు రేకెత్తిస్తోంది!

– వరప్రసాద్

# మలిదఫాలో మరింత వేగం

తొలి అయిదేళ్ల ఎన్‌డీయే పాలనలో ఆర్థిక సంస్కరణలపై ప్రధానంగా దృష్టి సారించారు. మౌలిక మార్పులకు శ్రీకారం చుట్టి వ్యవస్థలను గాడినపెట్టేందుకు ప్రయత్నించారు. మలి దఫా మోదీ జమానాలో అందుతున్న సంకేతాలను బట్టి సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యం పెరిగినట్లు కనిపిస్తోంది. ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ వెలువరించిన ప్రసంగంలో మోదీ ప్రభుత్వం గతంలో అమలు చేసిన సంక్షేమ పథకాలతోపాటు మున్ముందు పట్టాలకెక్కించదలచిన సంక్షేమాంశాల గురించీ ప్రస్తావించారు. బడుగు వర్గాలకు నగదు సాయం పెంచడంతోపాటు సేద్య రంగంలో పెట్టుబడులను ఇనుమడింపజేయడం, స్వయం ఉపాధి కార్యక్రమాలకు రుణసాయం పెంపు వంటి అనేక విషయాలను రాష్ట్రపతి ప్రసంగంలో ఉటంకించారు. ఒకే దేశం-ఒకేసారి ఎన్నికలు పేరిట 'జమిలి' ప్రతిపాదనను సైతం ఆయన ప్రస్తావించారు. ఏడు వేలకుపైగా పదాలున్న కోవింద్ ప్రసంగంలో- ఆర్థిక సంస్కరణలు, మాంద్యంనుంచి బయటపడేసి కార్పొరేట్ రంగానికి చురుకుపుట్టించడం, బెంబేలెత్తిస్తున్న రుణభార సమస్యను అధిగమించడం వంటి విషయాలేవీ ప్రస్తావనకు రాకపోవడం కొంత ఆశ్చర్యం కలిగించిందనే చెప్పాలి.

వాజ్‌పేయీ హయాములో సంస్థాగత సంస్కరణలతో దేశ ఆర్థికవ్యవస్థ కొత్త పుంతలు తొక్కింది. ప్రభుత్వ ఖజానాకు గుదిబండల్లా మారిన ప్రభుత్వ రంగ సంస్థలను వదిలించుకోవడం, విదేశీ పెట్టుబడులకు మార్గం సుగమం చేయడం, టెలికామ్ రంగంలో సమూల సంస్కరణలకు లాకులెత్తడం వంటి అనేక చర్యలతో వాజ్‌పేయీ జమానా కొత్త పంథాలో అడుగులు కదిపింది. వాజ్‌పేయీ జమానాతో పోలిస్తే పార్టీపరంగా ఇప్పుడు నరేంద్ర మోదీకి ఏమాత్రం ఎదురులేని పరిస్థితి. జాతి అభివృద్ధికి అత్యవసరమైన మౌలిక సంస్కరణలను వేగంగా అమలుపరచేందుకు ప్రభుత్వానికి అత్యంత అనుకూలమైన వాతావరణం ఉంది. ఆర్థిక వ్యవస్థను సమూలంగా మార్చివేయగల రెండు కీలక సంస్కరణలను నెత్తికెత్తుకోవడంపై తొలి అయిదేళ్ల పాలనలో తగిన శ్రద్ధకనిపించలేదు. భూ సమీకరణ చట్టానికి సంబంధించి సహేతుక విధానాలను రూపొందించడంలో తొలినాళ్లనుంచీ ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. ప్రజా ప్రయోజనాలతో నిమిత్తం లేకుండా ఎవరి భూమినైనా, ఎప్పుడైనా సేకరించి, నామమాత్ర పరిహారం చెల్లించే హక్కును ప్రభుత్వానికి కల్పిస్తూ 1894లో చట్టం తీసుకువచ్చారు. అన్నా హజారే ప్రారంభించిన అవినీతి వ్యతిరేక ఉద్యమం దేశవ్యాప్త అలజడి రేపిన నేపథ్యంలో- పాత చట్టాన్ని పూర్తిగా తలకిందులు చేస్తూ 2013లో యూపీఏ జమానాలో మరో చట్టం రూపొందించారు. 1894నాటి చట్టం భూ సమీకరణలో ప్రభుత్వానికి అలవిమాలిన హక్కులు కట్టబెడితే- యూపీఏ చట్టం సర్కారు వెసులుబాట్లను సంపూర్ణంగా హరించివేసింది. కనీసం జాతి భద్రతతో ముడివడిన అవసరాలకూ భూమిని సేకరించే వీలు లేని పద్ధతిలో ప్రభుత్వాన్ని పూర్తిగా బంధనాల్లో బిగిస్తూ యూపీఏ చట్టం చేసింది. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల పురోభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని సహేతుక మార్పులతో చట్టానికి కొత్త రూపు ఇవ్వాలంటూ అధికారంలోకి వచ్చిన వెంటనే 2014లో భాజపా సర్కారుపై ఎంతోమంది ఒత్తిడి తీసుకువచ్చారు. ఆ నేపథ్యంలోనే భూ సేకరణ విధానాలు- పరిహారం విషయంలో మార్పులు ప్రతిపాదిస్తూ మోదీ ప్రభుత్వం తొలినాళ్లలోనే అత్యవసరాదేశాన్నీ తీసుకువచ్చింది. అయితే ఆ తరవాత విపక్షాల విమర్శల నేపథ్యంలో ఆర్డినెన్సుపై వెనక్కితగ్గారు. భూసేకరణపరంగా నెలకొన్న సంక్లిష్టతల కారణంగా ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయి అభివృద్ధి వెనకడుగు వేసింది.



### ఆర్థిక వ్యవస్థలో కీలక మార్పులు

యూపీఏ జమానాలో జరిగిన తప్పులను సరిదిద్దడంలో ఏమాత్రం సంకోచించాల్సిన అవసరం లేదు. అవినీతి ఆరోపణల సుడిలో చిక్కుకొని ఉక్కిరిబిక్కిరి అయిన మన్మోహన్ జమానాలో- ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు అడ్డమైన నిబంధనలు కూర్చి తిరోగామి భూసేకరణ చట్టం తీసుకువచ్చారు. ఆ చట్టాన్ని సమన్వయ సాధకంగా మారిస్తే దేశంలో స్థిరాస్తి రంగం ఊపందుకొంటుంది. పారిశ్రామికాభివృద్ధికి అవసరమైన భూముల సేకరణ సాధ్యపడుతుంది. ఉండటానికి గూడులేక నానా ఇబ్బందులూ ఎదుర్కొంటున్న కోట్లాది భారతీయులకు ఊరట దక్కుతుంది. మోదీ ప్రభుత్వం దృష్టిపెట్టాల్సిన మరో కీలకాంశం కార్మిక సంస్కరణలు. యజమాని, కార్మికుల మధ్య సంబంధాలను సహేతుకంగా నిర్వచిస్తూ ప్రభుత్వం చట్టం తీసుకురావాలి. తద్వారా దేశవ్యాప్తంగా ఉపాధి విస్తరించడంతోపాటు ఉత్పాదకత పెంపునకూ బాటలు పడతాయి. భూ సమీకరణకు సంబంధించి నిర్మాణాత్మక మార్పులతోపాటు- కార్మిక చట్టాలను హేతుబద్ధంగా నవీకరించడం నేటి తక్షణావసరం. పెట్రో ధరలు, విత్త మార్కెట్లకు సంబంధించి పారదర్శక వ్యవస్థలు రూపొందించి ప్రశంసలు అందుకున్న మోదీ ప్రభుత్వం- దీర్ఘకాలంగా తెమలని జీఎస్టీపైనా కీలక నిర్ణయాలను ప్రకటించగలిగింది. అదే ఒరవడిని కొనసాగిస్తూ ఆర్థిక వ్యవస్థలో కీలక మార్పుల దిశగా మోదీ ప్రభుత్వం అడుగులు కదపాలి.

– వీరేంద్రకపూర్

## ఈనాడు లేఖలు

### ప్రమాదభరితంగా కాలుష్యం

నేటి సమాజంలో అన్ని రకాల కాలుష్యాలూ పెచ్చు మీరుతున్నాయి. గాలి, నీరు కలుషితమై ప్రాణాంతకంగా పరిణమిస్తున్నాయి. సహజసిద్ధంగా దొరికే నీరు కలుషితం కావడంతో నగరాల్లోనే కాకుండా, గ్రామాల్లోనూ ప్రజలు శుద్ధి చేసి విక్రయిస్తున్న నీటిని తాగాల్సిన దుస్థితి దాపురిస్తోంది. వాయు కాలుష్యం తాకిడికి ఊపిరితిత్తుల సమస్యలతో జనం సతమతమవుతున్నారు. పెద్ద నగరాల్లో కలుషితమైన గాలి ప్రజల పాలిట పెనుముప్పుగా మారుతోంది. ప్రభుత్వాలు ఈ సమస్యకు అత్యంత ప్రాధాన్యమిచ్చి, ప్రజలను కాపాడాల్సిన అవసరం ఉంది. కాలుష్య కారకాలైన వాహనాలు, కర్మాగారాల నియంత్రణకు తగిన ప్రణాళికలు అవసరం. పోలీసుల సహకారంతో ఆయా కాలుష్య నియంత్రణ శాఖలు తక్షణమే స్పందించి, తగిన చర్యలు తీసుకుని ప్రజలకు స్వచ్ఛమైన గాలి, నీరు అందించడానికి దోహదపడాలి.

- అందలం సత్యం, ముత్రాసుపల్లి, కడప జిల్లా

### ఆ రైలుతో ప్రయోజనాలెన్నో!

దశాబ్దాలుగా కలగానే మిగిలిపోతున్న కొవ్వూరు-భద్రాచలం రైల్వే లైన్‌కు కేంద్ర ప్రభుత్వం అనుమతి మంజూరు చేయాలి. రానున్న రైల్వే బడ్జెట్లో ఈ లైన్‌పై సానుకూల నిర్ణయం తీసుకోవాలి. ఈ లైన్ అందుబాటులోకి వస్తే, ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజనులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య పర్యాటకరంగం అభివృద్ధికీ ఇది దోహదపడుతుంది. రెండు రాష్ట్రాల మధ్య వాణిజ్యపరమైన లావాదేవీలు మరింత పెరుగుతాయి. ఏజెన్సీ ప్రాంతాల్లోనివారి ఆర్థికాభివృద్ధికీ పరోక్షంగా సహకరిస్తుంది. ఇన్ని ప్రయోజనాలతో కూడిన ఈ లైన్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాల పార్లమెంటు సభ్యులు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరుతున్నాం.

- వేదుల జనార్దనరావు, వంకావారి గూడెం, పశ్చిమగోదావరి జిల్లా

## అంతర్యామి

# నామస్మరణోత్సవం

ఉత్సవం ఏదైనా ఉత్సాహాన్నిస్తుంది, ఉల్లాసాన్ని కలిగిస్తుంది. ఏ ఉత్సవమూ నిరంతరం ఉండదు. నిర్విరామంగా సాగదు. ఉత్సవమంటే తాత్కాలిక సంబరం. అది ఎన్నో అవసరాల కలయిక. ఎన్నో సానుకూలపడవలసిన, ఎన్నో సమకూరవలసిన, ఎందరి తోడ్పాటుతోనో జరగాల్సిన కార్యం. వివిధ రకాల మనుషులు ఒకతాటిమీద, ఒకే అభిలాషతో నిర్వహించుకోవలసిన పండుగది. వాస్తవంలో ఎన్నో వ్యతిరేక భావాలు, ఎన్నెన్నో వైవిధ్యభరిత అభిరుచులు... దేవుడి వ్యవహారమైనా సరే, పక్కవాడిమీద పైచేయిగా ఉండాలనే ఆరాటం, అహం కనిపిస్తుంటాయి. అయినా ఉత్సవాలు జరుగుతూనే ఉంటాయి. జరిపిస్తూనే ఉంటారు.

మానవ జీవితంలో సామూహికంగా జరుపుకొనే పండుగలు పారమార్థిక ఉత్సవాలు. అన్నింటిలో, అందరితో రాజీపడి, వ్యయ ప్రయాసలకోర్చి చేసుకునే ఉత్సవాలిచ్చే ప్రయోజనమేమిటి? కోరికల సాధన, కోలాటాల సందడి, మానసికానందం, పారమార్థిక ప్రయోజనం. ముఖ్యంగా భగవంతుడి పట్ల ప్రేమ, భక్తుల అభివ్యక్తి. మంచిదే. అప్పుడప్పుడు జరుపుకొనే ఉత్సవమే అంత ప్రయోజనకారిగా ఉన్నప్పుడు దాన్ని నిర్విరామంగా నిర్వహించుకుంటే? నిరంతరాయ ఆనందంగా మలచుకుంటే, శాశ్వత క్రతువుగా స్వీకరిస్తే? అలాంటి అవకాశం మానవాళికి ఉందా అంటే, ఉంది. అదే నామ స్మరణోత్సవం. నామస్మరణ ఒక ఉత్సవమా? తప్పకుండా. ఏది మనకు ఆనందాన్నిస్తుందో, ఏది మనల్ని ఉన్న స్థాయినుంచి ఉన్నత స్థాయికి చేరుస్తుందో అది ఉత్సవమే... మహోత్సవం!

నామంమీద మనకు ఏ మాత్రం అభిరుచి ఏర్పడినా అంతకు మించి ఉత్సాహం, ఆనందం, అదృష్టం కలిగించే అంశం మరొకటి లేదు, ఉండదు. ఇతరులతో సంబంధం లేకుండా, వివాదాలకు తావు లేకుండా, మనకు మనమే, మనలో మనమే ఏకాంతంగా, ప్రశాంతంగా నిర్వహించుకునే ఉత్సవం. ఆర్థిక వనరులతో, ఆడంబరాలతో ప్రమేయం లేకుండా మనసనే మహోన్నత సంబారంతో నిరంతరం నిర్విరామంగా జరుపుకొనే మహోత్సవం. హృదయాంతరాలయంలో సంకల్పమాత్రంతో కావలసిన కోరుకున్న సర్వ వనరులతో జరుపుకొనే ఉత్సవం.



ఈ క్రతువులోనే చివరి శ్వాసను సమిధగా వదలాలి. భగవంతుడి అనుగ్రహమే యజ్ఞఫలంగా పొందాలి.

ఏమిటి ఈ ఉత్సవ విధానం? ఏమేం సిద్ధం చేసుకోవాలి? ఎలా చేయాలి? మనసు, మాధవుడి పట్ల మనోకామన. అంతే... చాలా సరళమైన, సురభిళమైన సునాయాస ఉత్సవం. ఒక నామం లేదా ఒక మంత్రం, మలిన రహితమైన మనసు కావాలి. నామాన్నో, మంత్రాన్నో తైల ధారలా నిరంతరంగా, నిర్విరామంగా ఉచ్చరించాలి, జపించాలి. అందులోనే జీవించాలి. మనం తొలిశ్వాసను తీసుకున్నది ఆదిగా ఎన్నో పనుల్లో ఉన్నా, ఎలాంటి స్థితిలో ఉన్నా శ్వాసించడం ఆపలేదు, ఆపలేం... చివరి శ్వాస వరకు. అలాగే భగవత్ స్మరణ.

నామస్మరణమీద అభిరుచి కలిగితే కష్టం, అయిష్టం అనే ప్రసక్తే ఉండదు. శ్రీరామ నీ నామ మెంతరుచిరా అంటూ ఉచ్చరిస్తూ, చప్పరిస్తూ, గుటకలు మింగుతూ, మనో జిహ్వతో ఆస్వాదిస్తూ, ఆత్మ నాసికతో ఆఘ్రాణిస్తూ, కలకండ కొరికిన చందాన నామంలోని బీజాక్షరాల అణువణువునూ కోటానుకోట్ల రోమాణువులతో ఆస్వాదిస్తాం. మనోశారీరకమైన రుచిమొగ్గలు ఆస్వాదనాస్త్రాలతో సొమ్మసిల్లిపోతాయి.

గాలి చేస్తోంది. గంగ చేస్తోంది. అంతరిక్షం చేస్తోంది. అర్కుడూ చేస్తున్నాడు. మనమూ చేద్దాం... అందరమూ చేద్దాం... ఈ అద్భుతమైన అద్వితీయమైన నామ స్మరణోత్సవం!

– చక్కిలం విజయలక్ష్మి

Eenadu epaper

ఈనాడు సినిమా



నాగచైతన్య



కీర్తి సురేష్

# నాగచైతన్య సరసన కీర్తి?

నాగార్జున కథానాయకుడిగా నటించిన 'సోగ్గాడే చిన్నినాయనా'కి కొనసాగింపుగా 'బంగార్రాజు' తెరకెక్కబోతోంది. త్వరలోనే ఆ చిత్రాన్ని సెట్స్‌పైకి తీసుకెళ్లేందుకు సన్నాహాలు చేస్తున్నారు. తొలి చిత్రాన్ని తెరకెక్కించిన దర్శకుడు కల్యాణ్ కృష్ణ కురసాల ఇప్పటికే 'బంగార్రాజు' స్క్రిప్టుని పూర్తిస్థాయిలో సిద్ధం చేసినట్టు సమాచారం. ప్రస్తుతం నటీనటులు ఎంపికపై కసరత్తులు జరుగుతున్నాయి. చిత్రంలో నాగార్జునతో పాటు ఆయన తనయుడు నాగచైతన్య కూడా ఓ పూర్తిస్థాయి పాత్రలో సందడి చేయబోతున్నారు. నాగచైతన్య సరసన కథానాయికగా కీర్తి సురేష్‌ని ఎంపిక చేస్తున్నట్టు సమాచారం. ప్రస్తుతం చిత్రబృందం ఆమెతో సంప్రదింపులు జరుపుతోంది. 'మహానటి' తర్వాత కొన్నాళ్లు తమిళంలోనే బిజీగా గడిపిన కీర్తి ప్రస్తుతం తెలుగుపై దృష్టి పెట్టింది. కథానాయిక ప్రాధాన్యమున్న ఓ చిత్రంతో పాటు 'మన్మథుడు 2'లో కీలక పాత్ర పోషిస్తోంది. 'బంగార్రాజు'ని సంక్రాంతికి విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు సమాచారం.

కొత్త కబుర్లు

# మరో కథ సిద్ధం



సాయిధరమ్‌తేజ్

విజయం సాయిధరమ్‌తేజ్‌లో ఉత్సాహాన్ని పెంచింది. 'చిత్రలహరి'తో మెప్పించిన ఆయన ఇకపై మళ్లీ జోరు పెంచే ప్రయత్నాల్లో ఉన్నారు. ఇప్పటికే మారుతి దర్శకత్వంలో ఓ సినిమా చేయడానికి పచ్చజెండా ఊపిన తేజ్, తదుపరి చిత్రం విషయంలోనూ ఓ నిర్ణయానికొచ్చారు. దేవా కట్టా దర్శకత్వంలో ఆయన ఓ సినిమా చేయబోతున్నట్టు సమాచారం. సామాజికాంశాలతో కూడిన ఓ కథని సాయిధరమ్ తేజ్ కోసం దేవా కట్టా సిద్ధం చేశారని సమాచారం. 'ప్రస్థానం'తో ప్రతిభని చాటిన దేవా కట్టాకి ప్రత్యేకమైన శైలి ఉంది. విభిన్ననేపథ్యంలో సినిమాలు చేస్తుంటారాయన. సాయిధరమ్ తేజ్ - దేవా కట్టా కలయిక ఆసక్తిని రేకెత్తిస్తోంది.

# 'రాగల 24 గంటల్లో' ఏం జరగనుంది?



శ్రీరామ్, కృష్ణభగవాన్, శ్రీనివాస్ రెడ్డి, ఈషా రెబ్బ, సత్యదేవ్, శ్రీనివాస్ కానూరు

సత్యదేవ్, ఈషా రెబ్బ, గణేష్ వెంకట్రామన్, ముస్కాన్ సేథీ ముఖ్య పాత్రల్లో నటించిన చిత్రం 'రాగల 24 గంటల్లో'. కథానాయకుడు శ్రీరామ్ ఓ కీలక పాత్ర పోషిస్తున్నారు. శ్రీనివాస్ రెడ్డి దర్శకుడు. శ్రీనివాస్ కానూరు నిర్మాత. హైదరాబాద్‌లో ఫస్ట్‌లుక్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సత్యదేవ్ మాట్లాడుతూ "సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రమిది. వాతావరణం గురించి చెప్పిన ప్రతిసారీ రాగల 24 గంటల్లో అనే మాట వినిపిస్తుంటుంది. ఆ మాటనే పేరుగా ఎంచుకొని ఆసక్తికరమైన కథని చెబుతున్నారు దర్శకుడు శ్రీనివాస్‌రెడ్డి. అందరికీ నచ్చే చిత్రమిది" అన్నారు. ఈషా మాట్లాడుతూ "నటనకి ఆస్కారమున్న పాత్ర చేశా. మరింత గుర్తింపుని తీసుకొస్తుంది" అన్నారు. "కామెడీ ప్రధానంగా సాగే చిత్రాల్ని చక్కగా తెరపైకి తీసుకొచ్చే శ్రీనివాసరెడ్డి, కొత్త తరహాలో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఆద్యంతం నవ్వులు పండిస్తూనే, ఆసక్తిని రేకెత్తించే చిత్రమిది. నా పాత్ర కథలో కీలకం" అన్నారు శ్రీరామ్. దర్శకుడు మాట్లాడుతూ "మొదటిసారి థ్రిల్లర్ కథతో సినిమా తీశాను. రాగల 24 గంటల్లో అనుకోని సంఘటనలు జరుగుతాయని తెలిసినప్పుడు ఎవరెలా స్పందించారు? అసలేం జరిగిందన్నది తెరపైనే చూడాలి. సత్యదేవ్, ఈషా, శ్రీరామ్ చక్కటి అభినయం ప్రదర్శించారు. వచ్చే నెలలోనే ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామ"న్నారు. నిర్మాత మాట్లాడుతూ "శ్రీనివాస్ రెడ్డితో సినిమా అంటే ఎంతో సరదాగా ఉంటుంది. ప్రతి సన్నివేశం ప్రేక్షకులు ఆస్వాదించేలా ఉంటుంది" అన్నారు. కృష్ణభగవాన్, రఘు కుంచె తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఆ విషయం మరిచిపోతే కదా!

"కథానాయకులతో కలిసి ఎప్పుడూ ఆడిపాడటమేనా? నాక్కూడా ఓ బలమైన పాత్ర వస్తే బాగుండేది కదా అని తొలినాళ్లలో అనిపించేది. కానీ ఇప్పుడు తిరిగి చూసుకుంటే ఆడిపాడే పాత్రలతోనే ప్రేక్షకులపై అంత ప్రభావం చూపించానా అని ఆశ్చర్యం కలుగుతోంది" అంటోంది తమన్నా. దక్షిణాదికి చెందిన అగ్ర కథానాయికల్లో తమన్నా ఒకరు. తెలుగు, తమిళంలో నటిస్తూనే అప్పుడప్పుడు హిందీలోనూ మెరుస్తోంది. కమర్షియల్ కథానాయిక అని పిలిపించుకోవడం ఎప్పుడూ గర్వంగానే ఉంటుందని చెబుతోంది. కెరీర్ తొలి రోజులు గుర్తుకొస్తుంటాయా అని అడిగితే... అసలు మరిచిపోతే కదా అంటోంది తమన్నా. "పదమూడేళ్లకే నా సినీ ప్రయాణం మొదలైంది. తొలినాళ్లలో అతి విశ్వాసం ఉండేది. ఏమైనా చేయగలననే ధీమాతో కనిపించేదాన్ని. అందుకేనేమో భాష తెలియకపోయినా ఆ వయసులో ధైర్యంగా తెలుగు చిత్ర పరిశ్రమకి వచ్చా. అప్పటి ధైర్యం, ఆత్మ విశ్వాసం ఇప్పుడుంటే ఇంకా ఏమేం చేసేదాన్నో! వయసు, అనుభవం పెరుగుతున్న కొద్దీ ఆలోచనల్లో పరిణతి పెరుగుతుంది. ఇప్పుడు నాలో ఉన్నది అసలైన ఆత్మవిశ్వాసం. ఒక పాత్రనైనా, కథనైనా పరిపూర్ణంగా అర్థం చేసుకొని చేసేంత పరిణతి ఇప్పుడే వచ్చిందని నా అభిప్రాయం. అందుకే ఇకపై నా సినీ ప్రయాణం మరో రకంగా ఉంటుందని నమ్ముతా" అని చెప్పింది తమన్నా. 'సైరా నరసింహారెడ్డి'లో ఓ కీలక పాత్ర చేస్తున్న తమన్నా, 'రాజు గారి గది 3' లోనూ నటిస్తోంది.



తమన్నా



ప్రియా ప్రకాష్ వారియర్, చంద్రశేఖర్ యేలేటి, నితిన్, వి.ఆనంద్‌ప్రసాద్

# నితిన్ చిత్రం ప్రారంభం

నితిన్ కథానాయకుడిగా భవ్య క్రియేషన్స్ పతాకంపై ఓ చిత్రం తెరకెక్కుతోంది. రకుల్‌ప్రీత్ సింగ్, ప్రియా ప్రకాష్ వారియర్ కథానాయికలు. చంద్రశేఖర్ యేలేటి దర్శకత్వం వహిస్తున్నారు. వి.ఆనంద్ ప్రసాద్ నిర్మాత. ఆదివారం హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో చిత్రం లాంఛనంగా ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత వి.ఆనంద్‌ప్రసాద్ కెమెరా స్విచ్చాన్ చేశారు. నితిన్ తండ్రి సుధాకర్ రెడ్డి క్లాప్‌నిచ్చారు. నిర్మాత మాట్లాడుతూ "నితిన్‌కి తగ్గ కథతో రూపొందుతున్న చిత్రమిది. ఆయన కెరీర్‌లో ప్రత్యేకంగా చెప్పుకునే సినిమా అవుతుంది. చంద్రశేఖర్ యేలేటి ఎంతో వైవిధ్యమైన కథలతో సినిమాలు తీస్తుంటారు. మా కలయికలో వస్తున్న ఈ సినిమా కొత్తగా ఉంటుంది. కీరవాణి సంగీతం ప్రధాన బలం. రకుల్ మా సంస్థలో ఇదివరకు 'లౌక్యం' చేశారు. ప్రియా ప్రకాష్ వారియర్‌ని మా సంస్థ నుంచి తెలుగు చిత్ర పరిశ్రమకి పరిచయం చేస్తుండడం ఆనందంగా ఉంది. చిత్రీకరణ వివరాల్ని త్వరలోనే ప్రకటిస్తాం. ప్రస్తుతం ఇతర నటీనటుల ఎంపిక జరుగుతోంది" అన్నారు. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: రాహుల్ శ్రీవాస్తవ్, రచనా సహకారం, మాటలు: వెంకట్ నరేష్ రెడ్డి.

# 'మా' సలహాదారుగా కృష్ణంరాజు



వి.కె.నరేష్, రాజశేఖర్

"ఐక్యత, పారదర్శకత, ప్రజాస్వామ్య పద్ధతుల్లో మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా)ని నిర్వహిస్తున్నాం" అన్నారు 'మా' అధ్యక్షుడు వి.కె.నరేష్. ఆదివారం హైదరాబాద్‌లో 'మా' సర్వసభ్య సమావేశం జరిగింది. సలహాదారుగా ప్రముఖ నటుడు కృష్ణంరాజుని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ "కొత్త కార్యవర్గం ఏర్పాటయ్యాక వారం రోజుల్లోనే మహిళల కోసం హెల్ప్‌లైన్‌ని ఏర్పాటు చేశాం. ఇప్పటిదాకా 30 ఫోన్ కాల్స్ వచ్చాయి. సలహాల బాక్స్‌కి కూడా మంచి స్పందన వస్తోంది. ప్రభుత్వాలతో మాట్లాడి సంక్షేమ పథకాల్ని సభ్యులకి వర్తింపజేసేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. 'మా' సభ్యత్వ విషయంలోనూ డిస్కౌంట్ల గురించి నిర్ణయం తీసుకొన్నాం. భవిష్యత్తులో కథానాయకులతో కలసి ప్రజలతో మమేకమై తెలుగు రాష్ట్రాల్లో కార్యక్రమాలు నిర్వహించబోతున్నాం. గతంలో 'మా'కి ఏఎన్నార్, కృష్ణ, చిరంజీవి సలహాదారులుగా ఉండేవాళ్లు. అలా ఈసారి కృష్ణంరాజుని ఎన్నుకున్నాం. కాళేశ్వరం ప్రాజెక్ట్‌ని ప్రారంభించిన కేసీఆర్‌కి, తెలంగాణ ప్రభుత్వానికి 'మా' తరఫున అభినందనలు" అన్నారు. కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడు రాజశేఖర్ మాట్లాడుతూ "మొదట 'మా'లో చిన్న మనస్పర్థలు ఉండేవి. కానీ సర్వసభ్య సమావేశం ఆరోగ్యకరంగా సాగింద"న్నారు. ఈ కార్యక్రమంలో 'మా' కార్యవర్గ సభ్యులు శివాజీరాజా, రాజీవ్ కనకాల, హేమ, శివబాలాజీ, పరుచూరి బ్రదర్స్, సురేష్ కొండేటి, సుదర్శన్, గౌతంరాజు, కవిత, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

**మనం చేసే తప్పుల వల్ల మన జీవితానికి ఏం జరిగినా ఫర్వాలేదు. కానీ పక్కనోడి జీవితానికే ఏ హానీ జరక్కూడదు.**

చిత్రం: గుణ 369

– పంపినవారు: టీఏఎస్ ప్రసాద్, చాగల్లు

పంచ్ డైలాగ్



తరుణ్‌తేజ్, లావణ్య

# పక్కింటి అమ్మాయి జీవితం

తరుణ్‌తేజ్, లావణ్య జంటగా నవీన్ నాయని తెరకెక్కిస్తున్న చిత్రం 'ఉండిపోరాదే'. డా.లింగేశ్వర్ నిర్మాత. చిత్రీకరణ పూర్తయింది. వచ్చే నెలాఖరులో చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రచార కార్యక్రమాల్లో భాగంగా తండ్రి గొప్పతనాన్ని తెలియజేసే పాటని విడుదల చేశారు. ప్రముఖ రచయిత సుద్దాల అశోక్‌తేజ ఆ గీతాన్ని రచించగా, సాబు వర్గీస్ స్వరాలు సమకూర్చారు. పాటని విడుదల చేసిన అనంతరం కథానాయకుడు సుధీర్‌బాబు మాట్లాడుతూ "ఓ కూతురు తన తండ్రి కోసం పాడే ఈ పాట చాలా బాగుంది. ఆడపిల్ల పుట్టుక చాలా అవసరం అని తెలియజెప్పే ఈ పాటతో సమాజంలో కొంతైనా మార్పు వస్తుంది" అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "ఇదొక నిజ జీవిత కథ. పక్కింటి అమ్మాయి జీవితాన్ని చూసినట్టుగా ఉంటుందీ చిత్రం" అన్నారు. నిర్మాత మాట్లాడుతూ "కథ మీద నమ్మకంతో మూడు భాషల్లో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నా. ప్రతి ఒక్కరి బాధ్యతని గుర్తు చేసే కథ" అన్నారు. ఈ కార్యక్రమంలో సాబు వర్గీస్, కేదార్‌శంకర్, సుబ్బారాయుడు బొంపెం తదితరులు పాల్గొన్నారు.

# 'అర్జునవేట' మొదలైంది



మధుసాయి వంశీ, శ్రావణి నిక్కీ

మధుసాయి వంశీ, శ్రావణి నిక్కీ, హిమబిందు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'అర్జునవేట'. కె.రవీంద్ర కల్యాణ్ దర్శకుడు. వాయల శ్రీనివాసరావు నిర్మిస్తున్నారు. ఆదివారం హైదరాబాద్‌లో ప్రారంభమైందీ చిత్రం. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత సి.కల్యాణ్ క్లాప్‌నిచ్చారు. నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ కెమెరా స్విచ్చాన్ చేశారు. దర్శకుడు మాట్లాడుతూ "ఒక యదార్థ సంఘటన ఆధారంగా తెరకెక్కిస్తున్న చిత్రమిది. రైస్‌పుల్లింగ్ నేపథ్యం ఇందులో కీలకం" అన్నారు. నిర్మాత మాట్లాడుతూ "సహజత్వానికి పెద్ద పీట వేస్తూ తెరకెక్కిస్తున్న చిత్రమిది. వచ్చే నెల 16 నుంచి చిత్రీకరణ మొదలు పెడతాం. హైదరాబాద్, చెన్నై, కేరళ తదితర ప్రాంతాల్లో కీలక సన్నివేశాల్ని తెరకెక్కిస్తాం" అన్నారు. సుబ్బరాజు, వెన్నెల కిశోర్, రావు రమేష్ తదితరులు నటిస్తున్నారు. ఛాయాగ్రహణం: వెంకట్, సంగీతం: డి.ఇమాన్.



'ఖాన్‌దాని సఫాఖానా'

# క్లినిక్ తెరిచిన సోనాక్షి

సోనాక్షి సిన్హా ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'ఖాన్‌దానీ సఫాఖానా: సెక్స్ క్లినిక్'. ఇందులో బేబీ అనే యువతిగా నటిస్తోంది సోనాక్షి. బేబీకి ఓ బంధువు ద్వారా సెక్స్ క్లినిక్ వారసత్వ ఆస్తిగా వస్తుంది. దాన్ని అమ్మాలంటే ముందు ఆరు నెలలు స్వయంగా నడపాలన్న షరతు ఉంటుంది. దీంతో సెక్సాలజిస్ట్‌గా రంగంలోకి దిగిన బేబీకి క్లినిక్‌కు వచ్చే వారి నుంచి ఎలాంటి అనుభవాలు ఎదురయ్యాయన్న కథతో ఈ చిత్రం తెరకెక్కుతోంది. భారతీయ సమాజంలో లైంగిక విజ్ఞానం గురించి బహిరంగంగా మాట్లాడడానికి ఇష్టపడని ధోరణిని చర్చిస్తూ సున్నిత హాస్యంతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. తాజాగా విడుదలైన ఈ సినిమా ట్రైలర్ నవ్వులు పూయిస్తోంది. ప్రముఖ పాప్ గాయకుడు బాద్‌షా కీలక పాత్రలో నటిస్తున్నారు. శిల్పి దాస్ గుప్తా తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని వచ్చే నెల 26న విడుదల చేయనున్నారు. సోనాక్షి 'దబాంగ్ 3'లో సల్మాన్ ఖాన్‌తో, 'మిషన్ మంగళ్'లో అక్షయ్ కుమార్‌తో కలసి నటిస్తోంది.

# వెబ్ సిరీస్ తీస్తా



అల్లాణి శ్రీధర్

"ప్రేక్షకుల అభిరుచులు మారుతున్నాయి. అందుకు అనుగుణంగా సినిమా కూడా మారుతోంది. నవతరం వెబ్‌సిరీస్‌కి అలవాటు పడింది. అందుకే నిర్మాణ సంస్థలు ఆ దిశగా దృష్టి సారిస్తున్నాయి. త్వరలోనే నేనూ ఓ వెబ్ సిరీస్‌ని తెరకెక్కిస్తున్నా" అన్నారు ప్రముఖ దర్శకుడు అల్లాణి శ్రీధర్. ఆయన ప్రస్తుతం చదలవాడ శ్రీనివాసరావు నిర్మాణంలో ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. దాంతోపాటు ఇదివరకు తీసిన 'కొమరంభీమ్' చిత్రాన్ని డిజిటలైజ్ చేసి మళ్లీ విడుదల చేసే ప్రయత్నాల్లో ఉన్నారు. ఆదివారం అల్లాణి శ్రీధర్ పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ఒక ప్రేమ జంట ద్వేషాన్ని ఎలా జయించిందనే అంశం ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నా. జులైలో విడుదల చేస్తాం. ఆ తర్వాత వెబ్ సిరీస్ ప్రారంభిస్తా. చారిత్రక కథతో కూడిన ఓ థ్రిల్లర్ కథతో దాన్ని రూపొందిస్తాన"ని తెలిపారు. లైంగిక దాడుల నేపథ్యంలోనూ ఓ చిత్రం చేయబోతున్నట్టు శ్రీధర్ తెలిపారు.

# ఇరాన్‌పై అమెరికా సైబర్ దాడులు!



**సైనిక కంప్యూటర్లే లక్ష్యం ● రాకెట్, క్షిపణి లాంచర్ వ్యవస్థలు నిర్వీర్యం**

వాషింగ్టన్

ఇరాన్ సైనిక కంప్యూటర్ వ్యవస్థలపై అమెరికా సైన్యం సైబర్ దాడులు చేపట్టింది. తమ నిఘా డ్రోన్‌ను కూల్చివేసిన ఇరాన్‌పై క్షిపణి దాడికి తొలుత సిద్ధపడి, చివరి నిమిషంలో ఆగిపోయిన నేపథ్యంలో ఈ చర్యకు ఉపక్రమించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుమతితోనే సైబర్ దాడులు జరిగాయి.

పేర్లు వెల్లడించడానికి ఇష్టపడని కొందరు అధికారుల కథనం ప్రకారం.. కొన్ని వారాలుగా ఇరాన్‌తో ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో సైబర్ దాడుల కోసం అమెరికా ఒక అత్యవసర ప్రణాళికను రూపొందించింది. దాని ప్రకారం ఇరాన్ దేశ రాకెట్, క్షిపణి లాంచర్లను నియంత్రించే కంప్యూటర్ వ్యవస్థలను నిర్వీర్యం చేసింది. నిర్దిష్టంగా ఇరాన్ సైన్యంలోని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ దళ కంప్యూటర్లను లక్ష్యంగా చేసుకుంది. సైబర్ యుద్ధంలో అమెరికా సాధించిన పట్టును, మరింత దూకుడుగా ఆ మార్గంలో దాడుల కోసం ట్రంప్ హయాంలో రూపొందించిన వ్యూహానికి ఇది దర్పణం పడుతోంది. ఏడాదిగా అమెరికా అధికారులు తమ శత్రువులను ఎక్కువగా సైబర్ రంగంలోనే లక్ష్యంగా చేసుకున్నారు. మరింత జోరుగా ఆపరేషన్లు చేపట్టారు.

ఈ సైబర్ దాడుల అంశంపై ఇరాన్ స్పందించలేదు. అయితే 'స్టక్స్‌నెట్ కంప్యూటర్ వైరస్' ఘటన తర్వాత ఇరాన్ తన మౌలిక వసతుల్లో చాలా భాగాన్ని ఇంటర్నెట్ నుంచి వేరు చేసింది. అమెరికా-ఇజ్రాయెల్‌లు సంయుక్తంగా సృష్టించినట్లు భావిస్తున్న ఆ వైరస్ వల్ల దాదాపు పదేళ్ల కిందట ఇరాన్‌లోని వేలాది సెంట్రిఫ్యూజ్‌లు మొరాయించాయి.

ఇరాన్ ప్రభుత్వం కోసం పనిచేస్తున్నట్లుగా భావిస్తున్న కొందరు హ్యాకర్లు కొన్ని వారాలుగా అమెరికా ప్రభుత్వంలోని ఆర్థిక, చమురు, గ్యాస్ వంటి రంగాలకు చెందిన సంస్థలను లక్ష్యంగా చేసుకున్నారు. హానికర ఈ-మెయిళ్లను పంపడం వంటివి చేసినట్లు క్రౌడ్‌స్ట్రైక్, ఫైర్ ఐ వంటి సైబర్ భద్రతా కంపెనీల ప్రతినిధులు పేర్కొన్నారు.

### మా దూరదృష్టిని బలహీనతగా భావించొద్దు: అమెరికా

తాము చూపుతున్న దూరదృష్టిని, విచక్షణను బలహీనతగా పొరపాటు పడవద్దని అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జాన్ బోల్టన్ ఇరాన్‌ను హెచ్చరించారు. "మధ్య ప్రాచ్యంలో వేటాడేందుకు ఎవరూ ఆ దేశానికి లైసెన్సు ఇవ్వలేదు. మా అధ్యక్షుడు ట్రంప్ చెప్పినట్లు మా సైన్యం పునరుత్తేజం పొంది, దాడికి సర్వసన్నద్ధంగా ఉంది" అని పేర్కొన్నారు. ఎప్పుడైనా దాడి చేసే స్వేచ్ఛ అమెరికాకు ఉందన్నారు. ఇరాన్‌పై మరో విడత ఆంక్షలను సోమవారం ప్రకటించే అవకాశం ఉందని చెప్పారు.

### మీ బలగాలకే ముప్పు: ఇరాన్

టెహ్రాన్: తీవ్ర ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికాకు ఇరాన్ మరోసారి హెచ్చరిక చేసింది. తమతో యుద్ధానికి దిగితే అది అదుపు తప్పిపోతుందని, ఈ ప్రాంతం మొత్తం దాని పరిణామాలు ఉంటాయని స్పష్టం చేసింది. అమెరికా బలగాల ప్రాణాలను అవి ప్రమాదంలో పడేస్తాయని ఇరాన్ సైనిక ఉన్నతాధికారి మేజర్ జనరల్ రషీద్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన సైన్యంలోని శక్తిమంతమైన రివల్యూషనరీ గార్డ్ దళ రాడార్, క్షిపణి వ్యవస్థల కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికా సైనికుల ప్రాణాలను రక్షించుకునేందుకు అక్కడి ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టంచేశారు. మరోవైపు ఇరాన్ పార్లమెంటు సమావేశంలోనూ ఎంపీలు ఇదే రీతిలో మాట్లాడారు. 'అమెరికాకు మరణం' అంటూ నినాదాలు చేశారు.

*నగదు ఒప్పందానికి భారత్‌తో చర్చలు*

అమెరికా ఆంక్షల నేపథ్యంలో ఆర్థిక లావాదేవీల సమస్యలను ఎదుర్కోవడానికి ఇరాన్ భారత్ సహా పలు దేశాలతో నగదు ఒప్పందాలు చేసుకునేందుకు ప్రయత్నిస్తోంది. ఇందుకోసం ఆయా దేశాలతో చర్చలు జరుపుతున్నట్లు ఇరాన్ విదేశాంగ మంత్రి జావెద్ జరీఫ్ చెప్పారు.

## ఇంకా లోటు వర్షపాతమే..

● 80% జలాశయాల్లో తక్కువ నిల్వలు

దిల్లీ: రుతుపవనాల పురోగతి ఇప్పటికీ మందకొడిగానే ఉండటంతో 84 శాతం వాతావరణ ఉప డివిజన్లలో లోటు వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. కేంద్ర జల కమిషన్ గణాంకాల ప్రకారం.. దేశంలోని 91 ప్రధాన జలాశయాల్లో 80 శాతం రిజర్వాయర్లలో నిల్వలు సాధారణం కన్నా తక్కువగానే ఉన్నాయి. పదకొండింటిలో నీటి నిల్వలే లేవు. రుతుపవన వర్షాల సీజన్ జూన్ 1 నుంచి సెప్టెంబర్ 30 దాకా ఉండగా, జూన్ 22 వరకు వర్షపాత లోటు 39 శాతంగా ఉంది. 36 వాతావరణ ఉప డివిజన్లలో 25 శాతం లోటు వర్షపాతాన్ని ఎదుర్కొంటున్నాయి. రుతుపవనాలు వారం ఆలస్యంగా జూన్ 8న కేరళకు చేరినా, అరేబియా సముద్రంలో వాయు తుపాను కారణంగా వాటి పురోగతి మందగించడంతో, ఇతర ప్రాంతాలకు చేరడం ఆలస్యమైంది.

## మత స్వేచ్ఛపై తీర్పులు చెప్పే హక్కు మీకు లేదు

అమెరికాకు భారత్ స్పష్టీకరణ

దిల్లీ: మత స్వేచ్ఛపై అమెరికా ప్రభుత్వం రూపొందించిన నివేదికను భారత్ తిరస్కరించింది. రాజ్యాంగ రక్షణ ఉన్న తమ పౌరుల హక్కులపై తీర్పులు చెప్పే అర్హత ఒక విదేశీ ప్రభుత్వానికి లేదని ఆదివారం స్పష్టంచేసింది. 2018కి సంబంధించి అంతర్జాతీయ మత స్వేచ్ఛ నివేదికను అమెరికా విదేశాంగ శాఖ శుక్రవారం విడుదల చేసింది. మైనార్టీ వర్గాలు.. ముఖ్యంగా ముస్లింలను లక్ష్యంగా చేసుకొని భారత్‌లోని హిందూ అతివాద మూకలు దాడులకు దిగుతున్నాయని అందులో పేర్కొంది. మాంసం కోసం ఆవులను విక్రయించడం లేదా వధించడం చేస్తున్నారన్న వదంతుల ఆధారంగా ఇలాంటి చర్యలకు దిగుతున్నారని తెలిపింది. దీనిపై మీడియా సంధించిన ప్రశ్నలకు విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రవీశ్ కుమార్ స్పందించారు. "భారత్‌కు తన లౌకిక విలువలు, అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా ఉన్న గుర్తింపు, బహుళత్వ సమాజం, సహనం వంటివి గర్వకారణం. మైనార్టీ వర్గాలు సహా తన పౌరులందరికీ ప్రాథమిక హక్కులను భారత్ కల్పిస్తోంది. ఇది ఒక ఉజ్వల ప్రజాస్వామ్య దేశమని, ఇక్కడ మత స్వేచ్ఛకు రాజ్యాంగపరమైన రక్షణ ఉందని అందరికీ తెలుసు. ఇక్కడ నెలకొన్న ప్రజాస్వామ్యయుత, చట్టబద్ధపాలనతో ప్రాథమిక హక్కులకు మరింత భద్రత సమకూరుతోంది" అని చెప్పారు.

### జమ్ముకశ్మీర్‌లో నలుగురు ఉగ్రవాదులు హతం

శ్రీనగర్: జమ్ము-కశ్మీర్‌లోని శోపియాన్ జిల్లా దరమ్‌దోరా ప్రాంతంలో ఆదివారం జరిగిన ఎదురుకాల్పుల్లో నలుగురు ఉగ్రవాదులు మృతి చెందారు. ఉగ్రవాదులు దాక్కొని ఉన్నారన్న సమాచారం అందుకున్న భద్రతా బలగాలు గాలింపు చర్యలు చేపడుతుండగా ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. దీంతో భద్రతా బలగాలు ఎదురు కాల్పులకు దిగాయి. ఈ కాల్పుల్లో నలుగురు ఉగ్రవాదులు హతమయ్యారు. వారంతా స్థానికులే. అల్‌ఖైదా అనుబంధ సంస్థ అన్సర్ గజ్‌వతుల్ హింద్‌కు చెందినవారుగా భావిస్తున్నారు.

### మాయావతి మేనల్లుడికి పార్టీ పదవి

లఖ్‌నవూ: బీఎస్పీ అధినాయకురాలు మాయావతి తన మేనల్లుడు, సోదరుడికి ఆదివారం పార్టీ పదవులు ఇచ్చారు. మేనల్లుడు ఆకాశ్ ఆనంద్ పార్టీ జాతీయ సమన్వయకర్తగా, సోదరుడు ఆనంద్ కుమార్ పార్టీ ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఆకాశ్ ఆనంద్ వయసు 24 ఏళ్లే. నాయకత్వ వారసత్వాన్ని అప్పగించే ప్రయత్నాల్లో భాగంగానే ఆయనకు ఈ పదవికట్టబెట్టినట్లు భావిస్తున్నారు. ఆయనతో పాటుగా పార్టీ ఉపాధ్యక్షుడు రాంజీ గౌతమ్‌కు కూడా పార్టీ జాతీయ సమన్వయకర్త బాధ్యతలు అప్పగించారు. మాయావతి సోదరుడు కుమార్ ఆనంద్ గతంలో కూడా పార్టీ ఉపాధ్యక్షుడిగా ఉండేవారు. అయితే కుటుంబ రాజకీయాలు నడుస్తున్నాయన్న విమర్శలు రావడంతో అప్పట్లో ఆయనను ఆ పదవి నుంచి తొలగించారు. లోక్‌సభలో పార్టీ నాయకుడిగా డానిష్ అలీ, చీఫ్‌విప్‌గా గిరీశ్ చంద్రలను నియమించారు.

*'జమిలి ఎన్నికల పేరుతో భాజపా కుట్ర'*

'ఒకే దేశం- ఒకే ఎన్నిక' అంటూ భాజపా ఇస్తున్న నినాదం వెనుక కుట్ర దాగి ఉందని బీఎస్పీ అధినాయకురాలు మాయావతి ఆరోపించారు. దఫదఫాలు కాకుండా ఒక్కసారే అక్రమాలకు పాల్పడి అన్ని ఎన్నికల్లోనూ గెలవాలన్నదే ఆ పార్టీ వ్యూహమని విమర్శించారు. ఆదివారం పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశంలో ఆమె ప్రసంగిస్తూ ఈవీఎంల్లో అక్రమాలకు పాల్పడడం ద్వారా భాజపా లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించిందని అన్నారు. ఆ పార్టీ గెలుపుపై సందేహాలు ఉన్నాయని చెప్పారు. జమిలి ఎన్నికల్లోనూ ఈవీఎంలను దుర్వినియోగం చేసి ఒకేసారి లోక్‌సభ, అసెంబ్లీలకు గెలుపొందాలని భావిస్తోందని ఆరోపించారు. ఎన్నికల సంఘం కూడా ప్రధాని ముందు తలవంచిందని, దాంతో స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణపై సందేహాలు వస్తున్నాయని అన్నారు.

### పర్సు కొట్టేసిన పైలట్!

దిల్లీ: ఎయిరిండియా పైలట్, ప్రాంతీయ సంచాలకుడిగా (తూర్పు ప్రాంతం) పనిచేస్తున్న రోహిత్ భాసిన్ ఆస్ట్రేలియాలోని సిడ్నీ విమానాశ్రయంలో ఉన్న డ్యూటీ ఫ్రీ దుకాణంలో పర్సు దొంగతనం చేశారు. ఆయన్ను సస్పెండ్ చేసినట్లు అధికారులు ఆదివారం తెలిపారు. శనివారం ఉదయం 6.30 గంటలకు (ఆస్ట్రేలియా కాలమానం ప్రకారం ఉదయం 10.45 గంటలకు) సిడ్నీ నుంచి దిల్లీ వచ్చే ఏఐ-301 విమానం కమాండర్లలో (పైలట్లు) భాసిన్ ఉన్నారు. "ప్రాంతీయ సంచాలకుడు (పైలట్ కూడా) రోహిత్ భాసిన్ సిడ్నీ విమానాశ్రయంలోని డ్యూటీ ఫ్రీ దుకాణంలో పర్సుని దొంగతనం చేసినట్లు తేలింది. దీనిపై ఎయిరిండియా విచారణ ప్రారంభించింది. ఆయన్ను సస్పెండ్ చేశాం. శనివారం రాత్రి 7.30కు విమానం దిల్లీలో దిగిన వెంటనే భాసిన్‌కు సస్పెన్షన్ ఉత్తర్వులు అందజేశాం" అని ఎయిరిండియా ప్రతినిధి ఒకరు తెలిపారు. ఎయిరిండియా ఆవరణల్లోకి భాసిన్ ప్రవేశించడాన్నీ నిషేధించినట్లు చెప్పారు.

# ఎన్ఐఏకు మరిన్ని అధికారాలు!

● చట్టసవరణపై నేడు కేంద్ర మంత్రివర్గం నిర్ణయం

దిల్లీ: జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)కి మరిన్ని అధికారాలు కల్పించే బిల్లుపై కేంద్రమంత్రివర్గం దృష్టిపెట్టింది. రెండు చట్టాలను సవరించడం ద్వారా భారతీయులకు, విదేశాల్లో భారత ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉగ్రవాద కార్యకలాపాలు చేపట్టేవారిపై దర్యాప్తునకు అనుమతించాలనే దిశగా ప్రభుత్వం యోచిస్తోంది. ఎన్ఐఏ చట్టం, చట్టవిరుద్ధ కార్యకలాపాల(నివారణ)చట్టం సవరణకు సంబంధించి కేంద్రమంత్రివర్గం సోమవారం నిర్ణయం తీసుకోనుంది. ప్రస్తుత వర్షాకాల సమావేశాల్లో సవరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నారు. సవరణ బిల్లు ద్వారా సైబర్ నేరాలు, మానవ అక్రమ రవాణా కేసులపై దర్యాప్తు చేపట్టే అధికారాలు ఎన్ఐఏకు దక్కనున్నట్లు తెలుస్తోంది.

*ప్రవాస భారతీయులకు ఓటేసే అవకాశం!*

విదేశాల్లో ఉండే భారతీయులకు ఓటింగ్ అవకాశాన్ని కల్పించేందుకు వీలుగా పార్లమెంటులో తాజాగా బిల్లు ప్రవేశపెట్టడంపై కేంద్ర మంత్రివర్గం దృష్టి సారించింది. గత నెలలో 16వ లోక్‌సభ రద్దుతో ఈ తరహా బిల్లుకు కాలం చెల్లిపోయింది. ఈ బిల్లును తిరిగి ప్రవేశపెట్టాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ బిల్లు ప్రకారం భారత్‌లో ఓటు హక్కు కలిగి ఉండి, విదేశాల్లో ఉండే భారతీయులు తమ తరఫున ఓటు వేసేందుకు ప్రతినిధి ఓటర్‌ను నియమించుకోవచ్చు. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అంచనాల ప్రకారం 3.10 కోట్ల ప్రవాస భారతీయులు ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో నివసిస్తున్నారు. ప్రవాస భారతీయులు ప్రతినిధి ద్వారా ఓటేసేందుకు వీలుగా ఎన్నికల చట్టాలను సవరించాలని ఎన్నికల సంఘం నియమించిన నిపుణుల కమిటీ గతంలోనే న్యాయశాఖకు సూచించింది. ఎన్నికల సంఘం వద్ద ఉన్న అనధికారిక గణాంకాల ప్రకారం కేవలం 10 వేల నుంచి 12 వేల మంది ప్రవాస ఓటర్లు మాత్రమే ఓటుహక్కు వినియోగించుకున్నారు. భారత్‌కు వచ్చి ఓటు వేసేందుకు తమ విదేశీ కరెన్సీని ఖర్చు పెట్టడం వారికి ఇష్టం ఉండటం లేదని తెలుస్తోంది. భారత్‌కు వచ్చి ఓటు వేయాలనే నిబంధన ప్రవాస ఓటర్లకు ఇబ్బందికరంగా మారిందని భావిస్తున్నారు. మరోవైపు.. సర్వీసు ఓటర్లకు సంబంధించి భార్య స్థానంలో జీవిత భాగస్వామి అనే పదం చేర్చాలని తాజా బిల్లు ప్రతిపాదిస్తోంది.

### వచ్చే నెలలో వేతన స్మృతి బిల్లు

కార్మిక సంస్కరణలపై దృష్టి పెట్టిన కేంద్ర కార్మిక శాఖ వేతన స్మృతి బిల్లుపై వచ్చే నెలలోనే మంత్రివర్గ ఆమోదం పొందనుంది. ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లో బిల్లును ప్రవేశపెట్టాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. సదరు బిల్లు 16వ లోక్‌సభ రద్దుతో కాలం తీరిపోయింది. వేతన స్మృతి బిల్లులో వేతనాలు, సామాజిక భద్రత, పారిశ్రామిక సురక్షితం, సంక్షేమం, పారిశ్రామిక సంబంధాలనే అంశాలున్నాయి. సులభతర వాణిజ్యం, పెట్టుబడుల్ని ఆకర్షించాలనే లక్ష్యంతో ఈ బిల్లును రూపొందించారు. ఇందులో కొన్ని రంగాలకు కేంద్రం కనీస వేతనాల్ని నిర్ణయించనుండగా, ఇతర రంగాల విషయంలో రాష్ట్రాలకు స్వేచ్ఛ కల్పించనున్నారు. కనీస వేతనాల్ని ప్రతి ఐదేళ్లకోసారి సవరించాలనే ప్రతిపాదన కూడా ఉంది.



## గడ్డం మెలేసి..

మీసాలు మెలేసే వ్యక్తుల్ని మనం చాలామందినే చూస్తుంటాం. ఫ్రాన్స్‌కు చెందిన టెడ్డీ బొన్నెట్ మాత్రం అందుకు భిన్నంగా గడ్డం మెలేశాడు. అందులో రెండు బంతులను నిలిపి ఉంచి అందరి చూపును ఆకర్షించాడు. తన గడ్డం బలాన్ని చాటుకున్నాడు. పారిస్‌లో శనివారం 'ఫ్రెంచ్ 2019 బియర్డ్స్ చాంపియన్‌షిప్' ప్రారంభానికి ముందు టెడ్డీ ఇలా ఫొటోలకు పోజులిచ్చాడు.

## గాంధీ కుటుంబమే క్రియాశీలంగా ఉండాలి!

కాంగ్రెస్ నేత మణిశంకర్ అయ్యర్

దిల్లీ: కాంగ్రెస్ పార్టీకి గాంధీయేతర కుటుంబానికి చెందిన ఎవరైనా అధ్యక్షుడిగా ఉండవచ్చని.. అయితే నెహ్రూ-గాంధీ కుటుంబం మాత్రం పార్టీలో తప్పక క్రియాశీలంగా వ్యవహరించాలని ఆ పార్టీ సీనియర్ నేత మణిశంకర్ అయ్యర్ అన్నారు. పార్టీపై ఆ కుటుంబానికి పట్టున్నప్పుడే సంక్షోభాలు, విభేదాలు వచ్చినప్పుడు పరిష్కృతం అవుతాయన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడిగా రాహుల్‌గాంధీ కొనసాగే విషయంలో అనిశ్చితి కొనసాగుతున్న నేపథ్యంలో అయ్యర్ ఓ వార్తాసంస్థతో ఆదివారం ముఖాముఖి మాట్లాడారు. 'గాంధీ-ముక్త్ కాంగ్రెస్'ను భాజపా కోరుకుంటోందని, దీంతో 'కాంగ్రెస్-ముక్త్ భారత్' సిద్ధిస్తుందన్నది ఆ పార్టీ ఆలోచన అని అయ్యర్ విమర్శించారు. తాము ఆ ఉచ్చులో పడతామని అనుకోవడం లేదన్నారు. చరిత్రలో ఎక్కువగా ఉద్యమాల్లోనే ఉన్న కాంగ్రెస్.. సారూప్య భావజాలం ఉన్న పార్టీలన్నీ ఏకతాటిపైకి వచ్చేదిశగా పనిచేయాల్సి ఉందన్నారు.

## ఇథియోపియాలో సైనిక కుట్రకు యత్నం

అడిస్ అబాబా: ఆఫ్రికాలో జనాభాపరంగా రెండో అతిపెద్ద దేశమైన ఇథియోపియాలో ఓ సైనిక జనరల్ కుట్రకు విఫలయత్నం చేశాడు. అమ్హారా ప్రాంతీయాధ్యక్షుడు అబచెవ్ మెకోన్నెన్, ఆయన సలహాదారుడిని అబచెవ్ అంగరక్షకులే కాల్చి చంపారు. ఇది జరిగిన కొన్ని గంటల్లోనే ఇథియోపియా ఆర్మీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ సీరే మెకోన్నెన్, మరో పదవీ విరమణ చెందిన జనరల్‌ను కూడా అంగరక్షకులే చంపారు. అమ్హారా రాష్ట్రాన్ని తన నియంత్రణలోకి తీసుకోవడానికి ఆ రాష్ట్ర భద్రతావిభాగం అధ్యక్షుడు జనరల్ అసమ్‌న్యూ త్సిగే ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని ఇథియోపియా ప్రధాని అబియ్ అహ్మద్ కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.

### ముఖర్జీ మృతిపై విచారణకు నెహ్రూ నిరాకరణ: నడ్డా

దిల్లీ: భారతీయ జన్‌సంఘ్ వ్యవస్థాపకుడైన శ్యామాప్రసాద్ ముఖర్జీ మృతిపై విచారణకు ఆదేశించడానికి అప్పటి ప్రధాని నెహ్రూ నిరాకరించారని భాజపా కార్యనిర్వాహక అధ్యక్షుడు జేపీ నడ్డా ఆదివారం ఆరోపించారు. "మొత్తం దేశమంతా శ్యామాప్రసాద్ ముఖర్జీ మరణంపై దర్యాప్తు జరిపించాలని కోరింది. నెహ్రూ మాత్రం విచారణకు ఆదేశించలేదు." అని నడ్డా విమర్శించారు. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేత రషీద్ అల్వీ స్పందిస్తూ.. భాజపా మత పరమైన ఉద్రిక్తతలను సృష్టిస్తోందన్నారు. "శ్యామా ప్రసాద్ ముఖర్జీ మరణం ప్రస్తావన దాదాపు 65 ఏళ్ల తర్వాత ఇప్పుడు అసందర్భం. నిందలు మోపడానికి బదులు దేశంలో మతసామరస్యాన్ని పెంచేందుకు కృషి చేయాలి" అని సూచించారు. జూన్ 23, 1953న శ్రీనగర్‌లో పోలీస్ కస్టడీలో శ్యామా ప్రసాద్ ముఖర్జీ మరణించారు. అనారోగ్య సమస్యల వల్లే ఆయన మరణించారని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పేర్కొంది. భాజపా మాత్రం ఈ వ్యవహారంలో కుట్ర దాగి ఉందని, విచారణ జరిపించాలని వాదిస్తోంది. భాజపాకు మాతృసంస్థ అయిన జన్‌సంఘ్ వ్యవస్థాపకుడు శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని పురస్కరించుకుని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు, భాజపా నేతలు ఆయనకు ఆదివారం ఘనంగా నివాళులు అర్పించారు.

## అలహాబాద్ హైకోర్టు జడ్జి శుక్లాను తొలగించండి

● ప్రధానికి సీజేఐ లేఖ

దిల్లీ: అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్.ఎన్.శుక్లాను పదవి నుంచి తొలగించే అభిశంసన ప్రక్రియ ప్రారంభించాలని కోరుతూ ప్రధాని నరేంద్రమోదీకి భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ రంజన్ గొగొయి లేఖ రాశారు. 2017-18 విద్యా సంవత్సరంలో ప్రయివేటు వైద్య కళాశాలల్లో విద్యార్థుల ప్రవేశానికి సంబంధించిన కేసులో అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సారథ్యంలోని ధర్మాసనం జారీ చేసిన ఉత్తర్వులను జస్టిస్ శుక్లా ఉల్లంఘించారన్న ఆరోపణలున్నాయి. ప్రయివేటు వైద్య కళాశాలల్లో 2017-18 ప్రవేశానికి సంబంధించిన కేసులో జస్టిస్ శుక్లాపై ఆరోపణల నేపథ్యంలో మద్రాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఇందిరా బెనర్జీ, సిక్కిం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎస్‌కే అగ్నిహోత్రి, మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీకే జైస్వాల్‌లతో అంతర్గత కమిటీ ఏర్పాటైంది. జస్టిస్ శుక్లాపై వచ్చిన ఆరోపణలు అత్యంత తీవ్రమైనవని కమిటీ తన విచారణ నివేదికలో స్పష్టం చేసింది. దీంతో అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా స్పందిస్తూ జస్టిస్ శుక్లా రాజీనామా చేయాలని, లేదంటే స్వచ్ఛంద పదవీ విరమణను ఎంచుకోవచ్చని సూచించారు. అందుకు జస్టిస్ శుక్లా తిరస్కరించారు. దాంతో, జస్టిస్ దీపక్ మిశ్రా వెంటనే అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాసి జస్టిస్ శుక్లాకు కోర్టు సంబంధమైన పనులను ఉపసంహరించాల్సిందిగా సూచించారు. ఈ పరిణామం జరిగిన తర్వాత జస్టిస్ శుక్లా దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. ఈ నేపథ్యంలో జస్టిస్ గొగొయి.. ప్రధానికి లేఖ రాశారు. జస్టిస్ శుక్లా వ్యవహారంలో అంతర్గత కమిటీ పేర్కొన్న అంశాలు తీవ్రమైనవని, ఆయన అభిశంసనకు ఉపక్రమించతగ్గవేనని తెలిపారు.

# పందిరి కూలి 14 మంది భక్తుల మృతి

● రాజస్థాన్‌లో దుర్ఘటన

బాడ్‌మేడ్: మతపరమైన ఓ కార్యక్రమంలో పందిరి కూలి 14 మంది భక్తులు దుర్మరణం చెందారు. ఈ దుర్ఘటన ఆదివారం రాజస్థాన్‌లో చోటుచేసుకుంది. బాడ్‌మేడ్ జిల్లా జసోల్‌లో రాణి భతియాని దేవాలయం సమీపంలోని ఓ పాఠశాల మైదానంలో నిర్వహించిన 'రామకథ' కార్యక్రమానికి వందల సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. ఇందుకోసం ఏర్పాటు చేసిన భారీ పందిరి బలమైన ఈదురు గాలులు, భారీ వర్షాల ధాటికి కూలిపోవడంతో పలువురు భక్తులు దానికింద చిక్కుకుపోయినట్లు పోలీసులు తెలిపారు. ఈ దుర్ఘటనలో 14 మంది మృతి చెందగా, 50 మంది వరకు గాయపడినట్లు అదనపు ఎస్పీ రతన్‌లాల్ భార్గవ తెలిపారు. గాలుల తీవ్రతకు పైకిలేచిన పందిరి కుప్పకూలిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. పందిరి కూలటం గమనించిన రామకథ నిర్వాహకుడు మురళీధర్ మహారాజ్ కార్యక్రమాన్ని అర్థంతరంగా ఆపేసి, అందరూ అక్కడ్నుంచి వెళ్లిపోవాలని చెబుతూ తాను వేదిక దిగిపోయారని, అక్కడ తొక్కిసలాట పరిస్థితి ఏర్పడిందని వివరించారు. బాధితులను రక్షించేందుకు యత్నించిన స్థానికులకు గుడారంలో కరెంట్ షాక్ కొట్టినట్లయిందని, అయినా చాలామందిని బయటకు లాగి ప్రైవేటు వాహనాల్లో ఆస్పత్రులకు తరలించినట్లు ఓ దుకాణదారుడు తెలిపారు. రాణిభతియాని మందిర్ సంస్థాన్ చేపట్టిన ఈ కార్యక్రమం శనివారం ప్రారంభమైంది. ఈనెల 30 వరకు సాగాల్సి ఉంది. ప్రధాని మోదీ మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు.



జసోల్‌లో ఆదివారం కూలిన పందిరి వద్ద విషణ్న వదనంతో స్థానికులు

# పాక్ జలాంతర్గామి కోసం జల్లెడ

● భారత నౌకాదళం వేట
● 21 రోజుల తర్వాత దొరికిన ఆచూకీ
● బాలాకోట్ దాడుల తర్వాత అరేబియా సముద్రంలో అలజడి

దిల్లీ: బాలాకోట్‌లో భారత వైమానిక దళ దాడి తర్వాత పాకిస్థాన్ జలాంతర్గామి ఒకటి అదృశ్యం కావడంతో మన నౌకా దళం అప్రమత్తమైంది. అది ఎటు వెళ్లిందో తెలుసుకోవడానికి భారీగా యుద్ధనౌకలు, విమానాలు, జలాంతర్గాములతో అరేబియా సాగరాన్ని రోజుల తరబడి జల్లెడ పట్టింది. ఆ జలాంతర్గామి వల్ల తన భద్రతకు ముప్పు పొంచి ఉండటంతో అది ఎక్కడ ఉందన్నది తెలుసుకునే వరకూ విశ్రమించలేదు.

జమ్మూకశ్మీర్‌లోని పుల్వామాలో ఉగ్రవాద దాడి జరిగిన తర్వాత భారత్ తన నౌకా దళాన్ని విన్యాసాల కోసం రంగంలోకి దించింది. అణు, సంప్రదాయ జలాంతర్గాములు సహా అనేక యుద్ధనౌకలను పాకిస్థాన్ ప్రాదేశిక జలాలకు దగ్గరగా మోహరించింది. భారత నౌకా దళం చేపట్టిన ఈ దూకుడు మోహరింపు వల్ల పాక్ ప్రభుత్వం బోల్తా పడింది. పుల్వామా దాడికి ప్రతిగా తన నౌకా దళం సాయంతో ప్రతీకార చర్యలకు భారత్ దిగుతుందన్న భావనకు వచ్చింది. అయితే ఊహించని రీతిలో భారత్ తన వైమానిక దళం సాయంతో పాక్‌లోని బాలాకోట్‌లో ఉన్న ఉగ్రవాద స్థావరంపై దాడి చేయడం ద్వారా ప్రతీకార చర్యకు దిగింది.

ఇదే సమయంలో పాకిస్థాన్ సైన్యం కదలికలపై భారత్ నిశితంగా కన్నేసి ఉంచింది. బాలాకోట్ దాడుల తర్వాత పాక్ నౌకాదళంలోని అత్యంత అధునాతన జలాంతర్గామి పీఎన్ఎస్ సాద్ ఆ దేశ జలాల నుంచి అదృశ్యమైంది. ఆ దేశానికి చెందిన మిగతా యుద్ధనౌకలు, జలాంతర్గాములు భారత నౌకాదళ నిఘా నేత్రం పరిధిలోనే ఉన్నాయి. సాద్‌లో 'ఎయిర్ ఇండిపెండెంట్ ప్రొపల్షన్ (ఏఐపీ) పరిజ్ఞానం ఉంది. దీనివల్ల అది సాధారణ జలాంతర్గాములతో పోలిస్తే ఎక్కువ రోజుల పాటు నీటి కింద ఉండిపోగలదు. ఈ నేపథ్యంలో అది ఎక్కడికి వెళ్లిందన్నది తెలుసుకునేందుకు భారత నౌకా దళం మొత్తం రంగంలోకి దిగింది.



కరాచీకి సమీపంలోని ప్రాంతం నుంచి సాద్ అదృశ్యమైనట్లు మన అధికారులు గుర్తించారు. అక్కడి నుంచి మూడు రోజుల్లో గుజరాత్ తీరానికి అది చేరుకోగలదు. అలాగే పశ్చిమ నౌకాదళ ప్రధాన కార్యాలయం కలిగిన ముంబయికి ఐదు రోజుల్లో రాగలదని తేల్చారు. ఆ జలాంతర్గామి వల్ల భారత భద్రతకు పెను ముప్పు ఉందని నిర్ధరించారు. దీంతో జలాంతర్గాములను గుర్తించి, ధ్వంసం చేసే యుద్ధనౌకలు, విమానాలను భారత్ మోహరించింది. నిర్దేశిత సమయంలో అది ఎక్కడి వరకూ వెళ్లగలదన్న అంచనాల ఆధారంగా మన నౌకాదళం గాలింపు చేపట్టింది. గుజరాత్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల తీరం వెంబడి పి-8ఐ విమానాలను రంగంలోకి దించింది. ఒకవేళ సాద్ భారత ప్రాదేశిక జలాల్లోకి ప్రవేశించినా ఎదుర్కోవడానికి వీలుగా అన్ని ముందుజాగ్రత్త చర్యలను చేపట్టింది. అణు జలాంతర్గామి ఐఎన్ఎస్ చక్రను కూడా పాక్ జలాల వెంబడి మోహరించింది. నౌకాదళంలో కొత్తగా చేరిన స్కార్పీన్ తరగతి జలాంతర్గామి ఐఎన్ఎస్ కల్వరి కూడా రంగంలోకి దిగింది. ఈ యుద్ధనౌకలు, జలాంతర్గాముల విన్యాసాలు పాక్‌ను ఉక్కిరిబిక్కిరి చేశాయి. భారత జలాల్లో ఎలాంటి దుస్సాహసం చేపట్టకుండా నిలువరించాయి.

మరోపక్క రోజులు గడిచిపోయినా సాద్ ఆచూకీ లేదు. దీంతో మన నౌకాదళం తన గాలింపును విస్తృతం చేసింది. ఉపగ్రహాలనూ వినియోగించింది. ఆ జలాంతర్గామిని పాక్ ఎక్కడో దాచి ఉంటుందన్న భావనకు భారత అధికారులు వచ్చారు. 21 రోజుల గాలింపు తర్వాత మన నౌకాదళం ఎట్టకేలకు పీఎన్ఎస్ సాద్ ఆచూకీని పసిగట్టింది. అది పాక్ పశ్చిమ ప్రాంతంలో ఉంది. బాలాకోట్ వైమానిక దాడుల తర్వాత రెండు దేశాల మధ్య ఘర్షణలు తీవ్రమైతే కోవర్ట్ కార్యకలాపాల కోసం దాన్ని అక్కడ దాచి ఉంచినట్లు వెల్లడైంది.



## చెక్ ప్రధానికి నిరసనల సెగ!

చెక్ రిపబ్లిక్ ప్రధానమంత్రి అంద్రెజ్ బబిస్‌కు నిరసనల సెగ తగిలింది. ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ దేశ రాజధాని ప్రేగ్‌లో వేలమంది ఆదివారం ఆందోళన చేపట్టారు. అవినీతికి పాల్పడ్డారని, తన మాజీ సంస్థలకు అనుచిత రీతిలో రాయితీలు కట్టబెట్టారని బబిస్‌పై ఆరోపణలున్నాయి.

